

క్రీడలకు సీఎం రేవంత్ పెద్దపీట

క్రీడలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ కమిషన్ కన్వీనర్ జంగా రాఘవరెడ్డి అన్నారు. - 8లో▸



వానాకాలం.. రైతన్న జరభద్రం!

వర్షాకాలంలో విష సర్పాల ప్రమాదం పొంచి ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.6^{0}/25.7^{0}

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బలహీన వర్గాలకు అండగా ప్రభుత్వం



నర్మెట: బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందిన కన్నెబోయినగూడెంకు చెందిన ఉచ్చంతల మమతకు రూ.60 వేలు, ఆగాపేటకు చెందిన మెరుగు శేఖర్‌కు రూ. 60 వేల విలువచేసే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మినారాయణ, జిల్లా మండల నాయకులు కొండయ్య, వేణుగోపాల్, వెంకన్న, శ్రీనివాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: అర్హులైన దివ్యాంగులు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి ఫ్లోరెన్స్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులకు ఆర్థిక ప్రోత్సాహక పథకం (ఎకనామికల్ రిహాబిలిటేషన్ స్కీం) కింద రుణాలు అందిస్తుందని, ఆసక్తి గల వారు ఈనెల 14 నుంచి 31వ తేదీ లోపు టీజీఓబీఎంఎంఎస్. సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వందశాతం రాయితీతో (రూ.50వేలు) 13 యూనిట్లు, 80శాతం రాయితీతో (రూ.లక్ష) 1యూనిట్, 70 శాతం రాయితీతో (రూ.2లక్షలు) 1 యూనిట్, 60 శాతం రాయితీతో (రూ.3లక్షలు) 1యూనిట్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి తెలిపారు.

'డీడీఎన్ అర్చకులు డబ్బులివ్వొద్దు'

జనగామ: జిల్లాలో ధూప దీప నైవేద్య అర్చకులు లంచం రూపంలో ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పవన్ శర్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమంది అర్చకుల వద్దకు వచ్చి దేవాలయాల ఎంక్వైరీ, చండీ హోమాలు అని చెబుతూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. హోమాలకు సంబంధించి వసూళ్లకు దేవాదాయశాఖ అనుమతులు లేవని, ఈ విషయంలో తప్పుగా ప్రచారం చేస్తున్నారన్నారు. అర్చకులు ఎవరికీ రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని, శాఖపరమైన సమాచారాన్ని అధికారికంగా తెలియజేస్తామన్నారు. అర్చకులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

త్రీ వీలర్స్, ఆటో మెకానిక్ పట్టణ కమిటీ ఎన్నిక



జనగామ: ది జనగామ త్రీ వీలర్స్ ఆటో మెకానిక్ యూనియన్ పట్టణ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎండీ మహమూద్, అధ్యక్షుడిగా గట్టు సత్యం, ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్ పాషా, ఉపాధ్యక్షులు ఎండీ యాకూబ్, సహాయ కార్యదర్శి మహేష్, కోశాధికారి బాలస్వామి, సలహాదారులు ఇట్టబోయిన రమేశ్, కె.నర్సింహులు, కె.శ్రీనివాస్, ఎండీ మహమూద్, కార్యవర్గ సభ్యులుగా మహిపాల్, కుమార్, సత్యం, నరేందర్, బాలరాజు, యాకుబ్ కల్యాణ్, రాజు, మహేందర్ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని శాలువాతో సన్మానించారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు: సీపీ

వరంగల్ క్రైం : మద్యంతాగి వాహనాలు నడపొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ వాహనదారులను హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారం రోజులుగా నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో 490 కేసులు నమోదైనట్లు ఆయన వివరించారు. 22 మందికి రెండ్రోజుల చొప్పున జైలుశిక్ష, మిగతా వారికి రూ.4,46,800 జరిమానా విధించారని పేర్కొన్నారు. హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 182 కేసులు నమోదు కాగా, 8మందికి జైలుశిక్ష, వరంగల్‌లో 126 కేసులు నమోదు కాగా 9 మందికి జైలు, కాజీపేటలో 125 కేసులు కాగా ఐదుగురికి జైలు శిక్ష పడిందని వివరించారు. వాహనదారులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే వరంగల్ కమిషనరేట్ పోలీసుల లక్ష్యమని సీపీ పేర్కొన్నారు.

హరిత టీచర్లు

పక్క ఫొటోలో కనిపిస్తున్న పాఠశాల పాలకుర్తి మండల కేంద్రం ప్రాథమిక పాఠశాల. ఇందులో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు చిదురాల శ్రీనివాస్ పాఠశాల ఆవరణను తీరొక్క మొక్కలతో పచ్చలహారంగా తీర్చిదిద్దారు. మొక్కలపై హెచ్‌ఎం చూపిస్తున్న ప్రేమ, శ్రమ ఫలితంగా బడి కాస్త పచ్చదనంతో తోటలా మారిపోయింది. ప్రకృతి, పర్యావరణంపై విద్యార్థులకు బోధిస్తూ పది కాలాల పాటు ప్రకృతిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. విద్యార్థులకు పాఠాలు బోధించడం ఒక్కటే కాదు... ప్రకృతి మన నిత్యందన జీవితంలో ఎలా ఉపయోగపడుతుందనే అవగాహన కల్పిస్తున్నామని హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు.

– పాలకుర్తి టౌన్





పై ఫొటో దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బిల్లా యాదవరెడ్డి, అండాలు దంపతులు. యాదవరెడ్డి 20ఏళ్ల క్రితం ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగే క్రమంలో 9 గుంటల వ్యవసాయ క్షేత్రంలో ఇల్లు నిర్మించుకున్నారు. ఒక గుంట స్థలం ఇల్లు నిర్మాణం చేయగా మిగతా ఖాళీ స్థలంలో భార్య అండాలుతో కలిసి రకరకాల మొక్కలు నాటగా, నేడు ఆ స్థలమంతా హరితమయంగా మారిపోయింది. పచ్చని హరివిల్లులో రాజకీయాలకతీతంగా సేద తీరుతూ ముచ్చటించుకునే ప్రతి ఒక్కరు ఈ దంపతులు చల్లంగా ఉండాలని కోరుకుంటారు.

– దేవరుప్పుల

- విద్యార్థుల భాగస్వామ్యంతో మొక్కల సంరక్షణ
- ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయులు
- ఇంటి పెరటితోటల్లో ఔషధమొక్కలు
- హరితహారంపై 'సాక్షి' స్ఫూర్తి కథనం



జనగామ: కాలుష్య రహితంగా మారుతున్న పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది. అంతరించి పోతున్న అడవులు.. అభివృద్ధి పేరిట మాయమైపోతున్న మహావృక్షాలతో స్వచ్ఛమైన గాలి పీల్చే పరిస్థితి లేకుండా పోతుంది. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న ప్రేమికులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంటి పెరట్లో పచ్చదనం పెంచుతూ.. ఔషధ, పూలు, పండ్ల మొక్కలతో స్వచ్ఛమైన వాతావరణంలో జీవనం సాగిస్తుంటే.. బడిలో పాఠాలతో పాటు మొక్కలు నాటే ప్రత్యక్ష బోధన చేస్తున్నారు టీచర్లు. చెరువు కట్టలు, ఖాళీ స్థలాలు, అటవీ ప్రాంతాల్లో సమాజ ప్రేమికులు మొక్కలను నాటుతూ వాటి సంరక్షణకు జీవితాలనే త్యాగం చేస్తూ రేపటి తరానికి ఆయుష్షు పోసేందుకు తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో హరితహారంపై 'సాక్షి' స్ఫూర్తి కథనం.

సండే స్పెషల్

పూలు..పండ్లు..ఔషధ మొక్కలు

నర్మెట: ఆ దంపతులకు పచ్చదనం అంటే అమితమైన ప్రేమ. మొక్కలను సంరక్షించడంలో ఆదర్శంగా నిలుస్తారు. స్వచ్ఛమైన వాతావరణం ఇంటినే పచ్చదనంగా మార్చుకున్నారు. స్వచ్ఛదనంలో ఆరోగ్య ప్రదాయనిగా పిలుచుకునే ఔషధ మొక్కలను పెంచుతూ పర్యావరణ ప్రేమికులుగా పిలువబడుతున్నారు నర్మెట మండల కేంద్రానికి చెందిన మహేశ్వరం అనిత, మురళి దంపతులు. రెండు దశాబ్ధాలుగా ఇంటి పెరట్లో 21 రకాల పూలు, పండ్లు, ఔషధ మొక్కలను పెంచుతున్నారు.



ఔషధమొక్కల వద్ద మురళిఅనిత దంపతులు

ఆహ్లాద పాఠశాల

బచ్చన్నపేట: పచ్చదనం, ఆహ్లాదకరం రెండూ కలగలిపిన వాతావరణంలో బచ్చన్నపేట మండలం ఆలీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాల స్ఫూర్తిగా నిలుస్తుంది. పాఠశాల మైదానం, ప్రహరీ గోడ చుట్టూ వేప, పూలు, పండ్ల మొక్కలు పెంచుతూ ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యాబోధన చేస్తున్నారు. నాటిన మొక్కలకు ప్రతీరోజు బడికి వచ్చిన వెంటనే విద్యార్థులు మొక్కలకు నీరు పోసిన తర్వాతనే ప్రార్థనలో పాల్గొంటారని హెచ్‌ఎం స్వర్ణతార తెలిపారు.



పాఠశాల ఎదుట పచ్చదనం

పర్యావరణ ప్రేమికుడు ఈ టీచర్

జఫర్‌గఢ్: పర్యావరణం పరిరక్షించుకుందాం ...అంటూ పాఠాలు చెప్పడమే కాదు.. ఆచరణలో సాధ్యం చేసి చూపిస్తున్నాడు జఫర్‌గఢ్ మండలం తిడుగు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కందుకూరు సుధాకర్. దేశ నాయకులు, పిల్లల పుట్టిన రోజు పురస్కరించుకుని మొక్కలు నాటించడమే కాకుండా, సంరక్షణకు వారిచే ప్రతిజ్ఞ చేయిస్తారు. ఇప్పటి వరకు ఆయన పని చేసిన పాఠశాలల్లో 2,500 మొక్కలు నాటి వందశాతం సంరక్షించిన సుధాకర్, కునూరులో 350, ప్రస్తుతం పని చేస్తున్న తిడుగు పాఠశాలలో 50 మొక్కలను నాటించారు.



చెట్లు అంటే ప్రాణం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన అందె నారాయణ చిన్ననాటి నుంచి మొక్కల పెంపకం అంటే ఇష్టం. తన ఇంటి వద్ద స్థలం లేకపోవడంతో ఘన్‌పూర్ చెరువు కట్ట ప్రాంతం, శ్మశాన వాటికలో మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. గడిచిన 15 ఏళ్లగా కానుగ, వేప, అల్లనేరేడు, మర్రి, రావి, జమ్మి మొక్కలతో పాటు అయా రకాల పూల మొక్కలు నాటి సంరక్షించడంతో నేడు వృక్షాలుగా మారాయి. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా పక్కనే ఉన్న చెరువు నీటిని బకెట్లలో తీసుకువెళ్లి వాటిని సంరక్షించడం విశేషం.



వృక్షాల నీడన నారాయణ

వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం వార, మాస కల్యాణంతో పాటు హోమ కార్యక్రమం నిర్వహించడంతో భక్తుల సందడి నెలకొంది. ఉదయం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల స్వామి వారి మాస, వార కల్యాణంతో పాటు హోమం నిర్వహించారు. భక్తులకు హైదరాబాద్, వరంగల్‌కు చెందిన బోడ మహేష్–వినీష, ముసిని నరేందర్–లావణ్య దంపతులు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మిప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

నిడిగొండ త్రికూటాలయాన్ని పునరుద్ధరించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్

రఘునాథపల్లి: హనుమకొండ వేయి స్తంభాల ఆలయం తరహాలో నిడిగొండ త్రికూటాలయాన్ని వెంటనే పునరుద్ధరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌడ రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం శిథిలావస్థలో ఉన్న మండలంలోని నిడిగొండ త్రికూటాలయాన్ని పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరుద్ధరణ పేర ఆలయ కళాఖండాలు కుప్పగా పోసి వదిలేయడంతో అవి నేలలో కూరుకుపోతున్నాయన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఆలయం పునఃనిర్మించి దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కావటి ముత్యాల్‌యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సోమేశ్వర్, ద్యావర రాజు, మల్కపురం శ్రీకాంత్, దైతల రంజిత్, చెవ్వ రాజు, యామంకి కొమురెల్లి, మహేందర్‌జీ, రవి, కమలాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ నీరు విడుదల చేయాలని ధర్నా

- ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే పల్లా

జనగామ రూరల్: బొమ్మకూర్ రిజర్వాయర్ నుంచి కాల్వల ద్వారా నీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరుతూ శనివారం మండలంలోని శామీర్‌పేట వద్ద జనగామ నుంచి సిద్దిపేట జాతీయ రహదారి వద్ద రైతులు ధర్నాకు దిగారు. దీంతో రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు అక్కడికి చేరుకొని అధికారులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. అనంతరం మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు, జిల్లా యువజన నాయకులు ఇరుగు సిద్దులు మాట్లాడుతూ మే, జూన్, జూలై మాసాల్లో తగినంత వర్షం కురవక పోవడంతో రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయని, వరి నాట్లకు కూడా నీరు లేదన్నారు. బొమ్మకూర్ ఎడమ, కుడి కాల్వల నుంచి నీరు అందించే నార్లు పోసుకుంటామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే నీళ్ల వదలాలని, లేదంటే కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మాజీ జిల్లా అధ్యక్షుడు శానబోయిన మైపాల్, మాజీ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు దడిగ సందీప్, బైరగోని యాదగిరి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ బొల్లం శారద, ఎడమ ఐలయ్య, దడిగ సిద్ధులు, శంకర్, నరేష్, రవి, రైతులు పాల్గొన్నారు.



శామీర్‌పేట వద్ద ధర్నా చేస్తున్న రైతులు, అఖిల పక్షం నాయకులు

పంపులు ఆన్‌చేయండి:ఎమ్మెల్యే పల్లా

జనగామ: నియోజకవర్గంలో నారుమళ్లకు సాగు నీరు అందడం లేదని, తక్షణమే పంపులు ఆన్ చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వానాకాలంలో సాగు చేసిన వరి, పత్తి, ఇతర పంటలను కాపాడాలంటే వందశాతం పంపులను ఆన్ చేయడమే శరణ్యమన్నారు. నార్లు, నాట్లు ఎండిపోయే దశలో ఉన్నాయని, కాపాడితేనే రైతులు చల్లంగా ఉంటారన్నారు. దేవాదుల నుంచి జనగామ నియోజకవర్గానికి సరిపడా సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.



ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

సర్కారు బడులకు ఉచిత ఇంటర్నెట్

- జిల్లాలో 75 పీఎస్, యూపీఎస్‌లు ఎంపిక
- బీఎస్‌ఎన్‌ఎల్ నుంచి సేవలు
- ఎఫ్‌ఎల్‌ఎన్ మెరుగు పరిచేందుకు..

జనగామ: సర్కారు బడుల్లో అమలు చేస్తున్న ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమాన్ని మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. సమగ్ర శిక్షలో భాగంగా బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్ భాగస్వామ్యంతో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉచిత ఇంటర్నెట్ సేవలను అందించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు సంబంధించి సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, డాక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి విడతలో కంప్యూటర్లు అందుబాటులో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపిక చేయడంతో పాటు వాటికి సంబంధించిన జాబితాను విడుదల చేశారు. జిల్లాలో 75 పీఎస్, యూపీఎస్‌లను గుర్తించారు. పాఠశాలలకు ఇంటర్నెట్ కనెక్షన్ ఇన్‌స్టాలేషన్‌కు సంబంధించి ఫార్మెట్ ప్రకారం ప్రతీ శనివారం ఈ–మెయిల్ ద్వారా ప్రభుత్వానికి జిల్లా విద్యాశాఖ రిపోర్టు చేయాల్సి ఉంటుంది. సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైన వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించాలని అందులో పేర్కొన్నారు. ఉచిత ఇంటర్నెట్ సేవలు ప్రారంభం కాబోతుండడంతో ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రోగ్రాంతో పాటు ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం లేకుండా పోతుంది.



జనగామ వీవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాల

జిల్లాలో అర్హత పొందిన పాఠశాలలు

మండలం	పాఠశాలలు
బచ్చన్నపేట	10
చిల్పూరు	5
దేవరుప్పుల	4
స్టేషన్‌ఘన్‌పూర్	9
జనగామ రూరల్	11
జనగామ అర్బన్	4
కొడకండ్ల	3
లింగాలఘణపురం	5
నర్మెట	2
పాలకుర్తి	4
రఘునాథపల్లి	11
తరిగొప్పుల	3
జఫర్‌గఢ్	4
మొత్తం	75

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

జఫర్‌గఢ్: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు చిట్టిమళ్ల కృష్ణమూర్తి, జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి శ్రవణ్‌కుమార్, జోనల్ చైర్మన్ సోమన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్య సామాజిక వర్గం నుంచి పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం విధివిధానాలను ఖరారు చేసేందుకు సంఘం జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ నేతృత్వంలో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా ఆర్యవైశ్య మహాసభ, అనుబంధ విభాగాలకు చెందిన నాయకులు, సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు అంచూరి యుగందర్, దాంశెట్టి సోమన్న, ఇమ్మడి అశోక్, బజ్జూరి సుధీర్, హరిశంకర్, సంతోష్, నాగరాజు, గందె మురళి తదితరులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి

జనగామ రూరల్: జిల్లా ఆర్యవైశ్య మహాసభ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మా గార్డెన్ నిర్వహించే మహాసభకు ఆర్యవైశ్య సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గన్ను నరసింహులు, కోశాధికారి బేజుగం భిక్షపతి, ఆంజనేయులు, రవీందర్, వేదకుమార్ తదితరులు పాల్గొన్నారు.


రేపటినుంచి సర్టిఫికెట్ల పరిశీలన

విద్యారణ్యపురి : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్‌ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్‌ఈ) పరీక్షల్లో అర్హత సాధించి మొదటి, రెండో దశలో కౌన్సెలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులకు ఈనెల 14, 15వ తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని హనుమకొండ ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ అబ్దుల్‌హై శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఈసెట్–2025 ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ మెమో, 4వ తరగతినుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. మొదటి, రెండో దశల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వని వారు డైట్‌లో మిగిలిన సీట్లకు, అదేవిధంగా మిగిలిన సీట్లలో ఈనెల 16న వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని తెలిపారు. రిజర్వేషన్లు, మెరిట్ ప్రాతిపదికన ఈనెల 19న సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 20నుంచి 22వ తేదీవరకు సంబంధిత డైట్‌లలో జాయిన్ కావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జనగామ రూరల్ : కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు (ఆదివారం) సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చంద్రమౌళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బాలాజీనగర్, ఎల్లమ్మగుడి, జ్యోతినగర్, కలెక్టర్ ఆఫీస్, ఆయుష్మాన్ హాస్పిటల్, అక్షయహోటల్, సెయింట్ మేరీస్ స్కూల్, సాన్ మారియా స్కూల్, ఏకశిల బీఈడీ కాలేజ్, అనంత సాయి, ఇందిరమ్మ కాలనీ, దత్తంరెడ్డి నగర్, శ్రీవిలాస్ కాలనీ ఏరియాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్‌టీఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రంగారావు



స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్‌టీఐ, హ్యూమన్ రైట్స్ అడ్వకేసీ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లికి చెందిన పార్శి రంగారావును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ప్రశాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేర విచారణలో ఫోరెన్సిక్ వైద్యుల పాత్ర కీలకం

- కేఎంసీ ఫోరెన్సిక్ విభాగాధిపతి లక్ష్మణరావు


మాట్లాడుతున్న లక్ష్మణరావు

ఎంజీఎం : నేర విచారణలో ఫోరెన్సిక్ వైద్యుల పాత్ర కీలకమని తెలంగాణ ఫోరెన్సిక్ మెడిసిన్ జనరల్ సెక్రెటరీ, కాకతీయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ విభాగాధిపతి సీహెచ్. లక్ష్మణరావు అన్నారు. కాకతీయ వైద్య కళాశాల ఎన్ఆర్ఐ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సు శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నేర ప్రదేశంలో ఆధారాల సేకరణ, నేర సంబంధీకుల భౌతిక ఆధారాల సేకరణ, కోర్టుల్లో జరిగే విచారణ ప్రక్రియలో ఫోరెన్సిక్ వైద్యులు సాయం చేస్తూ సమాజానికి సేవలందిస్తారన్నారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో నేరాలు నిరోధించే ప్రక్రియలో కూడా ఈ నిపుణులు తమ సేవలు అందిస్తారని కొనియాడారు. ఈ సదస్సులో కేఎంసీ ప్రిన్సిపల్ సంధ్య, ఫోరెన్సిక్ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అభిజిత్ సుబేదా, ఉస్మానియా ఆస్పత్రి ఫోరెన్సిక్ వైద్యవిభాగాధిపతి శ్రీధరాచారి, గాంధీ ఆస్పత్రి వైద్య విభాగాధిపతి కపాసింగ్, మేజర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కష్టమర్లకు బురిడీ..

- బంగారంతో వ్యాపారి పరారీ?

న్యూశాయంపేట : వరంగల్ శివనగర్‌లో కష్టమర్లకు బురిడీకొట్టి ఓ వ్యాపారి పెద్ద మొత్తంలో బంగారంతో పరారైనట్లు తెలిసింది. నెల రోజుల క్రితం బంగారు ఆభరణాల తయారీ కోసం కష్టమర్లు ఆ వ్యాపారికి ఆర్డర్ ఇచ్చారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా దుకాణం తీయకపోవడంతో కష్టమర్లకు అనుమానం వచ్చి వ్యాపారి భార్యతో షట్టర్ తెరిపించినట్లు సమాచారం. ఇందులో తాము ఆర్డర్ ఇచ్చిన బంగారం షాపులో కనిపించలేదు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈఘటన సోషల్ మీడియాలో వైరలవుతోంది. కాగా, తన భర్త ఆచూకీ కనిపించడం లేదని సదరు వ్యాపారి భార్య మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం..

- ఒకరిపై కేసు నమోదు


మహబూబాబాద్ రూరల్ : ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసిన ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి శనివారం తెలిపారు. సింగరేణిలో కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి హైదరాబాద్‌లోని సుచిత్ర ప్రాంతానికి చెందిన పిట్ల దత్తాద్రినారాయణ ఒకరి వద్ద రూ.9.45 లక్షలు, మరొకరి వద్ద రూ.13.40 లక్షలు తీసుకున్నాడు. అనంతరం ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వానాకాలం.. రైతన్న జర భద్రం!

పాములంటే భయపడే కాలం వచ్చింది. వర్షాకాలంలో భూమి మొత్తం వర్షాలతో తడిసి ఉండడమే కాకుండా పాములు ఏర్పాటు చేసుకున్న పుట్టలు కూడా వరద నీటితో నిండి ఉంటాయి. తన నివాసం నీళ్లతో నిండడం వలన విష సర్పాలు తమ రక్షణ కోసం బయటకు వస్తాయి. ఈ క్రమంలోనే చేనులు, పొలాల గట్లు, ఇళ్లల్లోకి చేరుతాయి. ప్రాణాలు తీసే విషసర్పాల నుంచి అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

- పొంచిఉన్న విష సర్పాల బెడద
- అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు

దంతాలపల్లి: వర్షాకాలంలో విష సర్పాల ప్రమాదం పొంచి ఉంది. పాము కాటుకు గురై చికిత్స అందక మండలంలో సంవత్సరానికి ఒకరో, ఇద్దరో మృతి చెందుతున్నారు. గతేడాది మండలంలో 25 మంది పాముకాటుకు గురైనట్లు వైద్యులు చెబుతున్నారు. వేసవి కాలంలో వ్యవసాయ పనులు ముగిశాక, వ్యవసాయ క్షేత్రాల్లో గట్ల వెంట, పుట్టల్లో విష సర్పాలు ఆవాసాలు ఏర్పర్చుకుంటాయి. నివాస స్థలాల పక్కనే ఉన్న చెట్లలాంటి ప్రదేశాల్లో కూడా ఉంటాయి. వర్షాకాలంలో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలను దున్నడం, పొలాల్లో నీళ్లు పెట్టడం వలన ఆ భూములు బురదమయంగా మారుతాయి. దాంతో విషసర్పాలు పొడి భూమిలోకి వెళ్తాయి. ఈ క్రమంలోనే ఇళ్లల్లోకి చేరడం, రైతులు తమ చేనులలో తొలగించిన గడ్డి, పిచ్చి మొక్కల్లో ఉంటూ వాటి ఆహారం కోసం వేట కొనసాగిస్తాయి. రైతులు పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు వాటిపై కాలు లేదా చేయి పడిన సమయంలో అవి కాటు వేస్తాయి. ఇళ్లలో కూడా దాక్కొని ఉంటూ అదును చూసి కాటు వేస్తాయి. పాము కాటుకు గురైన వారు మృతి చెందే అవకాశాలు ఎక్కువ.


స్టార్టర్ డబ్బాలో పడగ విప్పిన నాగుపాము (ఫైల్)

అప్రమత్తత చాలా అవసరం

కప్పలు, ఎలుకల సంచారం ఉండే ప్రదేశాల్లో పాములు ఎక్కువగా ఆహారం కోసం తిరుగుతుంటాయి. అలాంటి ప్రదేశాలకు వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ, పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవాలి. ఇంట్లో రంధ్రాలు ఉంటే వాటిని పూడ్చాలి. రాత్రివేళ బయటకు వెళ్లినప్పుడు చేతిలో కర్ర, లైట్లు తీసుకొని వెళ్లాలి. పడుకునే ముందు వాడుతున్న దుప్పట్లను జాగ్రత్తగా పరిశీలించాకే వాడుకోవాలి. ఇలాంటి చర్యల వలన తమను తాము కాపాడుకోవచ్చు.


పాము కాటుతో చికిత్స పొందుతున్న రైతు వెంకన్న (ఫైల్)

సర్పాల రకాలు - విష ప్రభావం

విష సర్పాలు ముఖ్యంగా రెండు రకాలు..

నాగుపాము : పాములలో నాగు పామును చాలా తెలివైన పాముగా పిలుస్తారు. ఈ పాము మనుషుల కదలికను పరిశీలిస్తూ కదులుతూ ఉంటుంది. ఈ పాము చాలా విషపూరితమైనది. నాగు పాము కాటు వేస్తే విష ప్రభావం చాలా త్వరగా చూపుతుంది. ఈ పాము కాటు వేసిన మనిషి, లేదా జంతువు నోట్లో నుంచి నురగ వస్తాయి. సరైన సమయంలో చికిత్స అందించకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

రక్తపింజర, నూనెకట్ల పాము, ఎర్ర : ఈ పాములు కాటు వేస్తే నెమ్మదిగా విషం ప్రభావం చూపుతుంది. కాటుకు గురైన మనిషిలో నెమ్మదిగా మార్పు మొదలవుతుంది. అది గమనించి చికిత్స వెంటనే చేయించాలి. లేదంటే ప్రాణాలపై ఆశ వదుకోవాల్సిందే. జెర్రిపోతు, నీరుకట్టె పాములకు విషం ఉండదు. అవి కాటు వేసినా మనుషులకు ఏ ప్రమాదమూ ఉండదు.

భయం, కంగారు వద్దు



“పాముకాటుకు గురైన వ్యక్తులు భయం, కంగారు పడొద్దు. వాటి వలన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. వైద్యశాలలో పాము, తేలు కాటు విరుగుడుకు మందులు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పాము కాటు వేస్తే నాటు వైద్యులను సంప్రదించకుండా ఆస్పత్రికి వెంటనే వస్తే వారికి తగిన చికిత్స అందిస్తాం.

\- కవిత, పీహెచ్‌సీ వైద్యురాలు

క్రీడలకు సీఎం రేవంత్ పెద్దపీట

- క్రీడాభివృద్ధికి రూ.265 కోట్లు కేటాయింపు
- ఉనికిచర్లలో స్పోర్ట్స్ స్కూల్ స్టేడియం నిర్మాణం
- ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ కమిషన్ కన్వీనర్ జంగా రాఘవ రెడ్డి


మాట్లాడుతున్న జంగా రాఘవ రెడ్డి

హన్మకొండ: క్రీడలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ కమిషన్ కన్వీనర్, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ ఎన్జీఓస్ కాలనీలోని శ్యామల గార్డెన్‌లో ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కమిటీకి ఎంపికైన ఎథిక్స్ కమిషన్ కన్వీనర్, ఖోఖో అసోసియేషన్ సౌత్ జోన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన జంగా రాఘవ రెడ్డి, ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మేకల సీతారామి రెడ్డి, కార్యవర్గ సభ్యులు నాతి కృష్ణమూర్తి, మడక ప్రసాద్, వై.మహేందర్ రావు ఆత్మీయ అభినందన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి క్రీడాభివృద్ధికి రూ.265 కోట్లు కేటాయించారన్నారు. మినీ స్టేడియాలు నిర్మించాలని సీఎం నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్లలో స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు స్టేడియాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ దిశగా చొరవ తీసుకున్నారన్నారు. ఖోఖో అసోసియేషన్ జిల్లా, రాష్ట్ర, సౌత్ జోన్ అధ్యక్షుడిగా, ఎథిక్స్ కమిషన్ కన్వీనర్‌గా ఖోఖో అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. ఖోఖో క్రీడను అభివృద్ధి చేయడంతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కాజీపేటలో సీనియర్స్ ఖోఖో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు మేకల సీతారాం రెడ్డి మాట్లాడుతూ ఖోఖో క్రీడాభివృద్ధికి జంగా రాఘవ రెడ్డి కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆయా క్రీడా అసోసియేషన్ల బాధ్యులు బి.కైలాష్ యాదవ్, కె.సారంగపాణి, శ్యామల పవన్ కుమార్, మహమ్మద్ ఖరీం, పి.రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సూర్యారావు, లిల్లి ఫ్లోరెన్స్, ఎ.సారంగపాణి, కె.మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఓ మూర్ఖుడు ముసలివాడని అంటున్నాడు..

- నాతో నడవాలి.. నాలాగా పనిచేయాలి
- సంక్షేమ పథకాల్లో అవినీతిని సహించను
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ: 'తాను ముసలివాడినని ఓ మూర్ఖుడు అంటున్నాడు.. నాకు ఏడు పదుల వయస్సని, నాతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపడిన చల్లా ధర్మారెడ్డి ఎద్దేవా చేశాడు.. సత్తా ఉంటే నాతోపాటు నడవాలి.. నాలాగే పని చేయాలి' అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కొనాయమాకుల రైతు వేదికలో 40 మందికి సీఎం రిలీఫ్ ఫండ్, ఇద్దరికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కల్యాణలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, సీఎంఆర్‌ఎఫ్ వంటి సంక్షేమ పథకాల్లో కాంగ్రెస్ కార్యకర్తలతోపాటు అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఆంధ్రా పాలకుల కంటే తెలంగాణ ఆవిర్భావం తర్వాత కేసీఆర్ కుటుంబం రెండు వందల రెట్లు ఎక్కువ అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్రం నుంచి పన్నుల పేరుతో కేంద్రానికి అధిక ఆదాయం వస్తున్నా మనకు నిధులు ఇవ్వకుండా పక్షపాతంగా వ్యవహరిస్తోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్, ఎంపీడీఓ పాక శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు చాడ కొమురారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్, ఆకుల రుద్రప్రసాద్, కూసం రమేష్, పత్తిపాక రవీందర్, దూల వెంకటేశ్వర్లు, దుపాకి సంతోశ్, ఎలగొండ ప్రవీణ్, చొల్లేటి మాధవరెడ్డి, కమలాపురం రమేశ్ పాల్గొన్నారు.

బతికుండగానే చంపేశారు..

- మృతదేహం అప్పగింతలో నిబంధనలు బేఖాతర్
- ఎంజీఎంలో బతికి ఉన్న వ్యక్తి చనిపోయాడంటూ వేరే మృతదేహం అప్పగింత
- ఔట్‌పోస్ట్ పోలీసుల తప్పిదమే ఘటనకు కారణం..
- ప్రాథమిక విచారణలో వివరాలు వెల్లడి


ఐడీ వార్డులో చికిత్స పొందుతున్న కుమారస్వామి

ఎంజీఎం : వరంగల్ ఎంజీఎంలో దారుణం జరిగింది. బతికున్న వ్యక్తిని చనిపోయాడంటూ కుటుంబీకులకు మరొకరి మృతదేహం అప్పగించారు. ఈ ఘటన ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన కుమారస్వామి(55) మృతి చెందాడని పేర్కొంటూ పోలీసులు శుక్రవారం కుటుంబ సభ్యులకు ఓ మృతదేహాన్ని అప్పగించారు. అయితే అంత్యక్రియలు నిర్వహిస్తున్న క్రమంలో ఈ మృతదేహం కుమారస్వామిది కాదని కుటుంబ సభ్యులు గుర్తించారు. సాయంత్రం తిరిగి మృతదేహాన్ని ఎంజీఎం మార్చరీకి తీసుకొచ్చారు. శుక్రవారం రాత్రి సమయంలో ఇది కుమారస్వామి మృతదేహమా.. కాదా? అయితే కుమారస్వామి మృతదేహం ఏమైంది అనే కోణంలో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో శనివారం ఉదయం కుమారస్వామి ఎంజీఎం ఆస్పత్రిలోని ఐడీ వార్డులో చికిత్స పొందుతున్నాడే విషయం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది.

అసలేం జరిగింది..

మైలారం గ్రామానికి చెందిన గోక కుమారస్వామి ఈనెల 9వ తేదీన తొర్రూరులో స్పృహ తప్పి కింద పడ్డాడు. వెంటనే పోలీసులు, స్థానికులు 108లో చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. కాగా, అదే రోజు హంటర్ రోడ్డులోని ఖమ్మం ఫ్లైఓవర్ రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి గాయాలతో అపస్మారక స్థితిలో ఉండగా వరంగల్ రైల్వే పోలీసులు 108లో ఎంజీఎం తరలించారు. ఈ క్రమంలో 10వ తేదీ గురువారం రైల్వే ట్రాక్ వద్ద గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయంలో ఔట్ పోస్టు పోలీసులు ఈ మృతదేహాన్ని పూర్తి స్థాయిలో పరిశీలించకుండా మైలారం గ్రామానికి చెందిన కుమారస్వామిదేనని తొర్రూరు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో తొర్రూరు పోలీసులు కుమారస్వామి భార్య రమకు మృతదేహాన్ని అప్పగించారు. చాపలో కట్టిన మృతదేహాన్ని పరిశీలించకుండా అంత్యక్రియలో సమయంలో పరిశీలిస్తే వేరే మృతదేహాన్ని గుర్తించి వెంటనే ఎంజీఎం మార్చరీకి తరలించారు.

ఐడీవార్డులో కుమారస్వామిని గుర్తించిన అధికారులు..

9వ తేదీన తొర్రూరు నుంచి ఎంజీఎం వచ్చిన కుమారస్వామి ఆస్పత్రిలో ఐడీ వార్డులో చికిత్స పొందుతున్నట్లు అధికారులు గుర్తించారు. అయితే గుర్తు తెలియని మృతదేహం ఎక్కడిదనే విషయాన్ని పరిశీలిస్తున్న క్రమంలో అదే రోజు రైల్వే ట్రాక్‌పై పడిన వ్యక్తి మృతదేహంగా పోలీసులు స్పష్టం చేశారు. కాగా, ఈ ఘటనకు కారణం ఔట్‌పోస్ట్ పోలీసుల తప్పిదం అని ఎంజీఎం అధికారులు.. పోలీసు అధికారులు ప్రాథమిక విచారణలో నిగ్గు తేల్చారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకార్మికుడి మృతి


భాస్కర్ (ఫైల్)

శాయంపేట : చేపల వేటకు వెళ్లి ఓ మత్స్యకారుడు చలివాగు చెక్‌డ్యాంలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కొప్పులలో జరిగింది. ఎస్సై జక్కుల పరమేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బండి భాస్కర్(45) శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులోని చలివాగు ప్రాజెక్టులోకి చేపల వేటకు వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో డ్యాంలో పడి నీట మునిగాడు. గమనించిన సహ మత్స్యకార్మికుడు పి. కిరణ్.. భాస్కర్ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. హుటాహుటిన కుటుంబ సభ్యులు చలివాగు వద్దకు చేరుకుని చూడగా భాస్కర్ అప్పటికే నీటిలో మునిగి మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఢీ.. వృద్ధుడి దుర్మరణం


మనోహర్‌రెడ్డి (ఫైల్)

జనగామ రూరల్: ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని పెద్దరాంచర్లలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంగ మనోహర్‌రెడ్డి (60) బైక్‌పై తన వ్యవసాయ బావి నుంచి ఇంటికి వస్తున్నాడు. ఓ ట్రాక్టర్ పెద్దరాంచర్ల నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా రాఘవపురం వెళ్తోంది. ఈ క్రమంలో ట్రాక్టర్, బైక్ గ్రామశివారులో ఢీకొన్నాయి. దీంతో మనోహర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆప్తాల్మాలజీ సొసైటీకి ప్రత్యేక గుర్తింపు

- ఆల్ ఇండియా ఆప్తాల్మాలజీ సొసైటీ అధ్యక్షుడు పార్థబిశ్వాస్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

మడికొండ: ఆప్తాల్మాలజీ సొసైటీకి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని ఆల్ ఇండియా ఆప్తాల్మాలజీ సొసైటీ అధ్యక్షుడు పార్థబిశ్వాస్ అన్నారు. మడికొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన 10వ జాతీయస్థాయి తెలంగాణ రాష్ట్ర ఆప్తాల్మాలజీ సొసైటీ కాన్ఫరెన్స్ రెండో రోజు శనివారం కొనసాగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథి పార్థబిశ్వాస్ మాట్లాడుతూ రీచ్ అంటే టెక్నాలజీ సర్వీసులు, సొసైటీకి అందుబాటులో ఉండడం అన్నారు. మొబైల్ వినియోగం, సోషల్ మీడియా, ఆహారపు అలవాట్లతో పిల్లల్లో కంటి సమస్యలు వస్తున్నాయన్నారు. దీనిపై ప్రభుత్వం ఆలోచించి పరిశోధనలు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీబీఐ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేత్ర సమస్యలను వైద్యపరంగా ముందు తెలుసుకోవడం, పరీక్షించడం ముఖ్యమన్నారు. మొబైల్ వినియోగంపై విద్యార్థులకు అవసరమైన జ్ఞానం ఇవ్వడం.. అవసరమైన సీఎంఈలు, కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం విద్యాసంస్థల బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా సొసైటీ నూతన అధ్యక్షుడిగా భరత్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నందకుమార్, సొసైటీ మాజీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, రాజలింగం , రవీంద్ర, పరమేశ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

- బీసీ గురుకులాల ఆర్‌సీఓ రాజ్‌కుమార్

విద్యారణ్యపురి : మహాత్మాజ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల (బీసీ) గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లోని వివిధ సబ్జెక్టుల్లో విద్యాబోధనకు తాత్కాలిక పద్ధతిన గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ గురుకులాల ఆర్‌సీఓ రాజ్‌కుమార్ తెలిపారు. హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సోషల్, బాటనీ, జూవాలజీ సబ్జెక్టులకు పీజీ బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పీజీ మెరిట్, డెమో మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. అర్హులు ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. జిల్లా కన్వీనర్ గురుకుల పాఠశాలల్లోనే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. హనుమకొండ జిల్లా జయగిరి ఎంజేపీ బాలుర పాఠశాల (9989603070), జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ ఎంజేపీ, గురుకుల పాఠశాల(89856382218), మహబూబాబాద్ జిల్లా కేసముద్రం బాలికల గురుకుల పాఠశాల (7989949221), ములుగు జిల్లా ఆరెపల్లి బాలికల గురుకుల పాఠశాలలో (9989991703), వరంగల్ జిల్లా వర్ధన్నపేట బాలికల గురుకుల పాఠశాలలో(9154102621), జనగామ బాలుర గురుకుల పాఠశాలలో (9052888229) దరఖాస్తులు సమర్పించాలని రాజ్‌కుమార్ కోరారు.

నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రామన్నపేట : ప్రభుత్వ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేస్తూ నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. నగరంలోని నయీంనగర్‌కు చెందిన నల్లవెల్లి అమరేందర్ కొద్ది రోజులుగా పోచమ్మమైదాన్‌లోని వేణు కాలనీలో హనుమాన్ ఆన్‌లైన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఆధార్‌లో మార్పులు, చేర్పుల లాంటి ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకుని హైదరాబాద్ మున్సిపాలిటీ, వరంగల్ రెవెన్యూ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేస్తూ బర్త్, నివాస సర్టిఫికెట్లు తయారు చేస్తూ అధిక మొత్తం డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఈ విషయం పై పలువురి సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి సదరు నిర్వాహకుడు అమరేందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుడి నుంచి హైదరాబాద్ మున్సిపాలిటీకి సంబంధించిన పలు ఖాళీ ఫార్మాట్ పేపర్లు, ముద్రించిన మీ సేవ ఫార్మాట్ పేపర్స్, ప్రింటర్, కీబోర్డు, రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు వివరించారు. ప్రజలు ఇలాంటి ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా సంబంధిత అధికారుల ద్వారా మాత్రమే సర్టిఫికెట్లు పొందాలని ఇన్‌స్పెక్టర్ గోపి సూచించారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్వాసన?

- రిజిస్ట్రేషన్ శాఖలో కలకలం

కాజీపేట అర్బన్ : రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో ఔట్ సోర్సింగ్‌కింద విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్వాసన పలకనుందని విశ్వసనీయ సమాచారం. హైదరాబాద్‌తోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఉన్నతాధికారులు ఇటీవల వరుస సమావేశాలు నిర్వహించడం, ఏజెన్సీల ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా కొనసాగుతున్న వారి స్థానంలో ప్రభుత్వమే శాశ్వత ఉద్యోగులను నియమించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

13మంది కొనసాగింపు ప్రశ్నార్థకం..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆఫీస్ సబార్డినేట్లు, షెరఫ్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా 13 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ తీరుతో వీరి కొనసాగింపు ప్రశ్నార్థకంగా మారనుంది. ఔట్ సోర్సింగ్ ద్వారా ఎంపికై రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు జవాబుదారీతనం కోల్పోతున్నారని తెలిసింది. అవినీతిని అరికట్టేందుకు ఇప్పటికే స్లాట్ బుకింగ్, ఈ–సైన్‌తో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సేవలు వేగవంతం చేస్తున్న ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రైవేట్ వ్యక్తులకు ప్రవేశం నిలిపివేయగా త్వరలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను సైతం తొలగించే యోచనలో ఉంది.

ప్రభుత్వమే రిక్రూట్ చేసుకునేలా..

ఔట్ సోర్సింగ్‌లో కొనసాగుతున్న వారిని తొలగించి ప్రభుత్వమే రిక్రూట్ చేసి వేతనాలు సైతం అందజేసేందుకు సమావేశాలు నిర్వహిస్తోందని సమాచారం. ఓ వైపు ఉన్నతాధికారులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు స్వస్తికి పలికేందుకు సమావేశాలను నిర్వహిస్తుండగా తమను తొలగించకుండా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సైతం సమావేశాలు నిర్వహించడం గమనార్హం.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

- శివాజీనగర్‌లో ఘటన


రమ (ఫైల్)

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శనివారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం శివాజీనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పొన్నాల చిన్న వెంకటేశ్, రమ (39) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో దంపతుల మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన రమ శుక్రవారం గడ్డిమందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న రమను కుటుంబీకులు హనుమకొండలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు.

ప్రాణహిత తగ్గుముఖం


కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద తగ్గిన వరద

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది వరద తగ్గుముఖం పట్టింది. శనివారం సాయంత్రం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద నీటి మట్టం 8.660 మీటర్ల ఎత్తులో తగ్గి దిగువకు తరలుతోంది. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మి బ్యారేజీ వద్ద 4.40 లక్షల క్యూసెక్కులు తరలిరాగా, మొత్తం 85 గేట్లు ఎత్తడంతో అదే స్థాయిలో దిగువకు తరలుతోంది. కాగా, నాలుగు రోజులుగా మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత నది ఉప్పొంగిన విషయం తెలిసిందే. సరస్వతీఘాట్ వద్ద వరద నీటిలో మునిగిన జ్ఞానదీపాలు బయటకు కనిపిస్తున్నాయి.